సీఎం రిలీఫ్ చెక్కు పంపిణీ



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడలో నివసించే సాయికిరణ్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్ చేతులమీదుగా అందజేశారు. డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, నాయకులు రాంచందర్, పీవీ.సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

ప్రారంభమైన వెంకన్న బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కోయిల్ అళ్వార్ తిరుమంజనం, విశ్వక్సేన ఆరాధన, రక్షా బంధనమ్, అంకురార్పణ, ధ్వజపటాదివాసం పూజా కార్యక్రమాలు ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసీరమణాచార్యులు నిర్వహించారు. ఈనెల 9 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో రవీందర్‌రెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం గరుడహోమము, శేషవాహనసేవ జరుగుతుందన్నారు.

తల్లిపాల వారోత్సవాలు



మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతం త్రిశక్తి సేవాసమితి సభ్యులు నిర్వహించారు. బాలింతలకు తల్లిపాలు బిడ్డలకు ఇవ్వడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్ ఆశాలత, సేవా సమితి సభ్యులు సూర్యకుమారి, జ్యోతి, శశి, కాత్యాయిని, లత పాల్గొన్నారు.

ప్రైమరీ హెల్త్ సెంటర్ ఉద్యోగి బదిలీ



ఉప్పల్ : ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రంలో దాదాపుగా రెండు దశాబ్దాల కాలం పాటు పని చేసిన బోగ ప్రకాష్ ఎక్స్‌టెన్షన్ అధికారిగా పదోన్నతిపై రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.

వాలీబాల్ పోటీల్లో నర్సింగ్ విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్‌రూరల్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో మెడిసిటీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు సత్తా చాటారు. సంగారెడ్డి జిల్లాలో స్టూడెంట్ నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లోని మెడిసిటీ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శనతో ట్రోఫీని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా షేర్ మెడికల్ కేర్ పౌండేషన్ అధ్యక్షుడు శివరామకృష్ణ, డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ హైమావతి, పీడీ శివారెడ్డి విద్యార్థులను అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కీసర: వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాలలో స్పెషల్ ఆఫీసర్ పుష్పలత ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటింటికీ తడి, పొడి వ్యర్థాలు వేరుచేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, పంచాయతీ సెక్రటరీ నారాయణగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ సామగ్రి వేలం

శామీర్‌పేట్: అలియాబాద్ మున్సిపాలిటీలోని స్క్రాప్‌ను బుధవారం కమిషనర్ చంద్రశేఖర్ అధ్యక్షతన మంగళవారం వేలంపాట నిర్వహించారు. అలియాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన స్క్రాప్ వేలంలో 11 మంది పాల్గొనగా.. మహమ్మద్ జావేద్ అలీ రూ. 3.27 లక్షలకు దక్కించుకున్నారు. ఇన్‌చార్జ్ రెవెన్యూ ఆఫీసర్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్ సనా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయంపై ఆర్టీసీ ఫోకస్ !

ఇప్పటికే రెండు టూర్‌లు.. సెలవుల్లో మరికొన్నింటికీ ప్రణాళికలు

బోడుప్పల్: తెలంగాణ రాష్ట్ర, రోడ్డు రవాణా సంస్థ చెంగిచర్ల, దివ్య పుణ్య క్షేత్రాల దర్శనాల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. నగర శివారు ప్రజల కోసం తక్కువ రేట్లతో నమ్మకమైన ప్రయాణంతో తీర్థయాత్రలకు తీసుకెళ్తూ.. ఆదాయ వనరులను సమకూర్చుకుంటుంది. ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ సంస్థ పట్ల నమ్మకం ఉండటంతో కాలనీ ప్రజలు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రజల నుంచి విశేష స్పందన ..

నిత్యం బిజినెస్, ఉద్యోగంతో బిజీగా ఉండే వారు సోలో ట్రిప్స్, వీకెండ్ టూర్స్‌కు వెళ్తుంటారు. వీరు ఎక్కువగా ప్రైవేట్ వాహనాలు, సొంత కార్లల్లో వెళ్తున్నారు. ఇలా వెళ్లడానికి ఇష్టపడని వారి అభిరుచులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ సంస్థ పుణ్యక్షేత్రాల దర్శనాల పేరుతో టూర్స్‌కు ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ పుణ్యక్షేత్రాల దర్శనాలకు స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు మరికొన్ని టూర్లను ప్లాన్ చేస్తూ.. ఆదాయ వనరులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తుంది.

జూన్ 27న మొదటి టూర్..

చెంగిచర్ల ఆర్టీసీ డిపో యాజమాన్యం మొదటగా జూన్ 27న మొదటి టూర్‌ను ప్లాన్ చేసింది. మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో ఒక్క రోజు టూర్ ప్లానింగ్‌కు పెద్దలు రూ.600, పిల్లలకు రూ.300 చొప్పున ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పెట్టారు.

◆ ఉప్పల్ చౌరస్తా నుంచి వెండికొండ సిద్ధి వినాయక ఆలయం, షాద్‌నగర్‌లో రామలింగేశ్వర ఆలయం, అమ్మపల్లిలో సీతారామాంజనేయ ఆలయం, పెంజర్ల అనంత పద్మనాభ ఆలయం, మూచ్చింతల సమతామూర్తి విగ్రహం వరకు ఒక్కొక్క బస్సుకు 40 మంది చొప్పున 4 బస్సులను నడిపారు.



పుణ్యక్షేత్రాలకు వెళ్తున్న కాలనీవాసులు (ఫైల్)

అరుణాచలం పుణ్యక్షేత్రానికి..

అరుణాచలం పుణ్య క్షేత్రానికి రెండో టూర్ ప్లాన్‌ను జూలై 11న సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేశారు. పెద్దలకు రూ.3,900, చిన్న పిల్లలకు రూ. 3300ల చొప్పున నిర్ణయించారు. ఉప్పల్ చౌరస్తా, నాగోల్ చౌరస్తా, ఎల్‌బీనగర్, ఆరాంఘర్ మీదుగా కాణిపాకం విఘ్నేశ్వరస్వామి దర్శనం, వెల్లూరు గోల్డెన్ టెంపుల్ అమ్మవారి దర్శనం, అరుణాచలం యాత్రకు వెళ్లారు. రెండ్రోజుల పాటు జరిగిన ఈ యాత్ర విజయవంతంగా నడిపి మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది.

దర్శనాలు బాగా చేయించారు...



పుణ్యక్షేత్రాల దర్శనాలు బాగా చేయించారు. సీనియర్ సిటిజన్స్‌ను దృష్టిలో ఉంచుకుని స్పీడ్ బ్రేకర్ల వద్ద జాగ్రత్తగా నడిపారు. ఇదే విధంగా ఆర్టీసీ సంస్థ తెలంగాణలో ఉన్న అన్ని పుణ్య క్షేత్రాలకు ప్రతి నెల టూర్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఆర్టీసీకి కూడా ఆదాయం పెరుగుతుంది.

– నారాయణరావు, ప్రయాణికుడు

ఆర్టీసీ సంస్థ సేవలు బాగున్నాయి..



ఆర్టీసీ తక్కువ ధరకు తీర్థయాత్రలకు తీసుకెళ్తూ మెరుగైన సేవలను అందిస్తోంది. పుణ్య క్షేత్రాల వద్ద దర్శనం బాగా చేయిస్తున్నారు. ఆర్టీసీ ప్రయాణం సౌకర్యవంతంగా ఉంది. కాలనీ ప్రజలు కూడా ఈ యాత్రలపై ఆసక్తి చూపుతున్నారు.

– కళావతి, ప్రయాణికురాలు

మరిన్ని టూర్లకు ప్రణాళికలు



భవిష్యత్తు సెలవు దినాల్లో మరిన్ని టూర్లు ప్లాన్ చేస్తున్నాం. కాలనీల్లో కనీసం 30 మంది ఉంటే బస్సును నేరుగా పంపిస్తాం. ఇలా ఎవరైనా కాలనీవాసులంతా ముందుకొస్తే బస్సును ఏర్పాటు చేస్తాం. సీనియర్ సిటిజన్స్ ఎక్కువగా యాత్రల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. దైవ దర్శనాలు చేయించడంతో పాటు బస్సును అందుబాటులో ఉంచుతూ.. ఆర్టీసీ సంస్థ ఆదాయం సమకూర్చుకుంటోంది.

– కవిత, డిపో మేనేజర్ చెంగిచర్ల

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

కుషాయిగూడ: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం కుషాయిగూడలోని కుత్బుల్లాపూర్ మైనారిటీ రెసిడెన్షియల్ హైస్కూల్, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహం నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు. చదువుతో పాటు అదనపు అంశాల్లో కూడా విద్యార్థులు పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందే అంశాలను కలెక్టర్ విద్యార్థులకు వివరించారు.

హైస్కూల్ విద్య తొలిమెట్టు..

హైస్కూల్ విద్య భవిష్యత్తుకు తొలిమెట్టని, ఎంచుకున్న లక్ష్యానికి చేరువయ్యేలా కార్యాచరణ చేసుకుని విజయం సాధించాలన్నారు. ఒత్తిడికి లోనుకాకుండా వెనుకంజలో ఉన్న సబ్జెక్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. అల్పాహారం, ఏ విధమైన భోజనం ఇస్తున్నారనే అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా మైనారిటీ అధికారి కాంతమ్మ, కాప్రా తహసీల్దార్ సుచరిత, ప్రిన్సిపాల్ సునీతారాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాప్రా సర్కిల్‌కు మంజూరైన రూ.5.55 కోట్ల నిధులకు సంబంధించిన ప్రొసిడింగ్ పత్రాలను మంగళవారం కుషాయిగూడ కూరగాయాల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్‌లు హాజరై మాట్లాడారు. మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, కొత్త అంజిరెడ్డి, సీతారాంరెడ్డి, విఠల్‌నాయక్, వెంకట్‌రెడ్డి, ప్రసాద్ మార్కెట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, రాజిరెడ్డి, రవినాయక్, రవీందర్, సూర్యకుమార్ తదితరులున్నారు.

నేడు నిమజ్జనంపై సమన్వయ కమిటీ సమావేశం

మల్కాజిగిరి: వినాయక చవితి పర్వదినం, నిమజ్జనంలో భాగంగా నేడు 11 గంటలకు సర్కిల్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, మండప నిర్వాహకులు, అన్ని విభాగాల అధికారులతో డీసీ జకియాబేగం సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తున్నారు.

పనులు వేగవంతంగా పూర్తి చేయండి

మౌలాలి: డివిజన్ దీన్‌దయాల్‌నగర్‌లో 8 నెలల క్రితం మొదలైన ఆర్‌సీసీ పైపులైన్ పనులు నత్తనడకన కొనసాగడంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే నిర్మాణ పనులు వేగవంతం చేయాలని స్థానిక కార్పొరేటర్ సునీత సంబంధిత అధికారులను కోరారు. తవ్వి వదిలేసిన చాంబర్ల వలన డ్రైనేజీ నీరు పక్కనే ఉన్న ఇళ్లలోని బోర్‌వెల్స్‌లోకి వచ్చి కలుషితమవుతున్నాయన్నారు. చిన్నపాటి వర్షానికే మురుగు, వరదనీరు ఇళ్లను ముంచెత్తుతుందని, తీవ్రమైన దుర్గంధం వ్యాపిస్తుందని, కాలనీవాసులు చెబుతున్నారని కార్పొరేటర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

జేసీబీ ఢీకొని వృద్ధుడి మృతి

అల్వాల్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధుడిని జేసీబీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల ప్రకారం.. మచ్చబొల్లారంలో నివసించే రాంచంద్రన్ (70), మంగళవారం ఉదయం కొంపల్లి ఐస్ ఫ్యాక్టరీ రోడ్డు నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన జేసీబీ ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలహారం బండి ఊరేగింపు

మల్లాపూర్: అమ్మవారి దయతో మల్లాపూర్ సుభిక్షంగా ఉండాలని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ అన్నారు. మల్లాపూర్ డివిజన్ ఎన్‌ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయితేజ టీమ్ ఆధ్వర్యంలో పలహారం బండి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

క్రైస్తవుల హక్కుల సాధనకు సమష్టి కృషి

గౌతంనగర్: రాష్ట్రంలో క్రైస్తవుల హక్కుల సాధనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని, మాజీ అడిషనల్ డీజీపీ బాబురావు, ఎస్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు బిషప్ సంజయ్ ఆనంద్ అన్నారు. మంగళవారం గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్ కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ క్రైస్తవ వేదిక ఆవిర్భావసభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ అడిషనల్ డీజీపీ బాబురావు, ఎస్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు బిషప్ సంజయ్‌ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి బక్క ఏలియా హాజరయ్యారు.

నూతన కార్యవర్గం

తెలంగాణ క్రైస్తవ కళాకారుల వేదిక ముఖ్య సలహాదారులుగా రెవరెండ్ సుదర్శన్, రెవరెండ్ బక్క ఏలియా, అధ్యక్షులుగా రెవరెండ్ సునీల్, ఉపాధ్యక్షులుగా రెవరెండ్ పీటర్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా రెవరెండ్ స్టీఫెన్, రూరల్ సెక్రటరీగా రెవరెండ్ క్రిస్టోఫర్, కోశాధికారిగా రెవరెండ్ కథా లూకాస్, న్యాయసలహాదారుగా ఉపేందర్, మెడికల్ వింగ్ ఇన్‌చార్జిగా డాక్టర్ ప్రీతిదయాల్, గౌరవ అధ్యక్షులుగా కుమారస్వామి, అడ్మిన్ సెక్రటరీగా సంజీవ్, ఆర్గనైజింగ్ కార్యవర్గులుగా జాన్‌పాల్, ప్రభుకిరణ్, కార్యనిర్వాహక సభ్యులుగా రాంచందర్, అరుణ్‌కుమార్, పురుషోత్తం స్వామి, అశోక్, సుధాకర్, మోసెస్ ఎన్నికయ్యారు.

రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ఆలయ వార్షికోత్సవంలో కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, బీఎన్‌రెడ్డినగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆమెను ఘనంగా సత్కరించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, ప్రభుగౌడ్, సత్తమ్మ, రమాదేవి, సంధ్య, మల్లేష్, నర్సింగ్‌రావు, శంకర్, సదానందం, బాలరాజు, సురేష్, శ్రీనివాస్, మోహన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై మంగళవారం ధర్నా చేశారు. పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని టీచర్లు ఈ సందర్భంగా నినాదాలు చేశారు. స్కూళ్లకు ఉచిత విద్యుత్, పారిశుద్ధ్య నిర్వహణ నిధుల విడుదలతో పాటు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ప్రభుత్వం కల్పించడంపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ హర్షం వ్యక్తం చేస్తూనే.. దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది.

◆ ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై కొనసాగుతున్న నిర్లక్ష్యంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలని పోరాట కమిటీ కోరింది. ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వాసం కలిగించేలా విద్యారంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మాణిక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, శ్రీనివాస్, కుమార్ స్వామి, రాకేష్, మైపాల్‌రెడ్డి, ఉపేందర్, టీపీటీఎఫ్ అధ్యక్షుడు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, శామీర్‌పేట్ మండల అధ్యక్షుడు తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్ సమగ్రాభివృద్ధే ధ్యేయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నాచారం డివిజన్ పరిధిలోని రూ.80 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. భవానీనగర్, వీఎస్టీకాలనీ, స్నేహపురి కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు, నాచారం ఎర్రకుంటలోని హిందూ శ్మశానవాటికలో రూ.30 లక్షలతో చేపట్టబోయే స్నానాల గదులు, అదనపు బర్నింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. డీజీఎం సతీష్, ఏఈ వినీత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'మాన్సూన్' స్పెషల్ డ్రైవ్

కుషాయిగూడ: వర్షాకాలం నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'మాన్సూన్' స్పెషల్ డ్రైవ్ కాప్రా సర్కిల్‌లో కొనసాగుతోంది. మంగళవారం మీర్‌పేట్-హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్‌బీకాలనీ, ఆనంద్ నగర్, ఎల్‌ఐజీ ఫేజ్-1, ఈడబ్ల్యూ, వేంకటేశ్వరనగర్ కాలనీల్లో డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్లను శుభ్రం చేయడంతో పాటు పిచ్చి మొక్కల తొలగింపు, నీటి గుంతల్లో దోమల మందు చల్లి స్థానికులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటుగా సామాజిక బాధ్యతగా భావించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్‌నాయక్ సూచించారు. ఏఎంహెచ్‌ఓ మధుసూదన్‌రావు, సీఎంఓహెచ్ పద్మజ, వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, ఈఈ నాగేందర్, డీఈ రూప, ఏఈ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌బీకాలనీ, రాజీవ్‌పార్కులో శుభ్రం చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

వనమహోత్సవంలో మాజీ సైనికుల భాగస్వామ్యం

మల్లాపూర్: గ్రేటర్ హైదరాబాద్‌లో 79 వేల మొక్కలను నాటేందుకు సిద్ధమైన మాజీ సైనికులను ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అభినందించారు. మంగళవారం మాజీ సైనికుడు మామిడాల సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాచారంలో వన మహోత్సవం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్‌బాబు సూచనల మేరకు 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా 30 వేల మంది మాజీ సైనికులు జీహెచ్‌ఎంసీ పరిధిలో 79 వేల మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు.



మొక్క నాటుతున్న పరమేశ్వర్‌రెడ్డి

చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలి



అల్వాల్: రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ అన్నారు. పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ.. చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలని మంగళవారం అల్వాల్ తుర్కపల్లిలో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కేశపాక రాంచందర్, సురేష్‌కుమార్, మంద ఆనంద్, షబానా, మధుసూదన్‌రెడ్డి, ఆజాం, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా థీమ్ పార్కు

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని కలర్స్ థీమ్‌పార్కు ఓ పక్క వాకర్లకు ఆహ్లాదాన్ని పంచుతుంది. మరో పక్క మందుబాబులకు అడ్డాగా మారింది. ఉదయం వేళ వాకర్స్ వచ్చే సమయానికి థీమ్‌పార్క్‌లో మందు సీసాలు దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళ్లలో మందుబాబులు తాగి సీసాలను వదిలేసి వెళ్తున్నారు. ఓపెన్ బార్‌లాగా మారుస్తున్న ఆకతాయిల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు. పార్క్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



తాగి వదిలేసిన మద్యం బాటిళ్లు

డెలివరీ బాయ్స్ నిరసన..

న్యాయపరమైన సమస్యలు పరిష్కరిస్తామన్న యాజమాన్యం

ఉప్పల్: తమ డిమాండ్ల సాధనకు ఉప్పల్ జోన్ జోమాటో డెలివరీ బాయ్స్ ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. తార్నాక, ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్, ఎల్‌బీనగర్, తదితర ప్రాంతాలకు చెందిన డెలివరీ బాయ్స్ యాజమాన్య వైఖరిని నిరసిస్తూ.. మంగళవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరసనకారులు రఘుపతి, సుబ్రహ్మణ్యం, రాజు తదితరులు మాట్లాడుతూ.. తమ డిమాండ్ల సాధన కోసం ఉప్పల్‌లో ఉన్న జోమాటో కార్యాలయానికి వస్తే పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. సమాచారం అందుకున్న జోమాటో బాయ్స్ అంత ఏకమైన ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను యాజమాన్యానికి తెలపడానికి ప్రయత్నం చేస్తున్న వారిపై కేసులు పెట్టడంపై ప్రశ్నించారు. యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ఉప్పల్ పోలీస్‌స్టేషన్ వద్ద జోమాటో బాయ్స్ తమ నిరసనను తెలిపారు. తమ సమస్యలను గుర్తించి రేట్ కార్డు ఇవ్వాలని, రోజుకు 12 గంటలు పనిచేస్తే కనీసం రూ.1000 వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి బాయ్‌కు నెలవారి ఇన్సురెన్స్ కాకుండా ఏడాదికోసారి చెల్లించాలని కోరారు. కాగా ఒక్కసారిగా వచ్చిన బాయ్స్‌ను చూసిన యాజమాన్యం న్యాయపరమైన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలు డంప్ చేసిన వారికి జరిమానా



కుషాయిగూడ: రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలను డంప్ చేసిన వారికి శానిటేషన్ అధికారులు జరిమానా విధించారు. గతంలో పలుమార్లు హెచ్చరించిన మార్పు లేకపోవడంతో దుకాణదారుడికి మంగళవారం జరిమానా విధించినట్లు శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్ తెలిపారు. కుషాయిగూడ, వీఎన్‌రెడ్డినగర్ కల్వర్టుపై ఓ స్క్రాప్ దుకాణ యజమాని ప్లాస్టిక్ వ్యర్థాలను చాలా రోజులుగా డంప్ చేస్తున్నాడు. ఈ క్రమంలో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతుండటంతో గతంలో పలుమార్లు అధికారులు వారిని హెచ్చరించిన ఫలితం లేకపోవడంతో రూ.5 వేల జరిమానా విధించారు. కల్వర్టుకు ఇరువైపులా డంప్ చేసిన వ్యర్థాల సంచులను వెంటనే తొలగించాలని, లేదంటే జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు.

మురుగు.. పరుగు

కుషాయిగూడ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మ్యాన్‌హోల్స్ పొంగి మురుగు ప్రవహిస్తోంది. దీంతో వీధుల్లో దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం అంటు వ్యాధులతో అనారోగ్యం భారినపడే ప్రమాదం ఉందంటున్నారు. కుషాయిగూడ బస్తీ దవాఖానా మురుగునీటితో నిండిపోయింది. దీంతో రోగులు అవస్థలు పడుతున్నారు. మురుగు సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

